గిట్టుబాటయ్యేనా..?

- భారీ వర్షాలతో పడిపోయిన దిగుబడి
- మిగిలిన పంటను ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు
- అమాంతం పెరిగిన కూలిరేట్లు



మేఘాలు కమ్ముకోవడంతో కాజులూరులో హడావుడిగా మాసూళ్లు చేస్తున్న కూలీలు

కాజులూరు: 'మూలిగే నక్కపై తాటిపండు పడిన' చందంగా తయారయ్యింది నియోజకవర్గంలోని దాళ్వా రైతుల పరిస్థితి. దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో కోటి ఆశలతో మాసూళ్లకు ఉపక్రమించిన రైతులను అకాల వర్షాలు నట్టేట ముంచాయి. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో గత ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని రైతన్నలు కుదేలయ్యారు. వరుణుడు కరుణించి శుక్రవారం కాస్త తెరిపినివ్వడంతో మిగిలిన పంటను ఒబ్బిడి చేసుకునేందుకు సిద్ధమయ్యారు. వాతావరణ మార్పులతో అమాంతం పెరిగిన కూలిరేట్లు వరి రైతులను కలవరపరుస్తున్నాయి. కాజులూరు మండలంలో ఈ ఏడాది 19,076 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం వర్షాల సమయానికి 80 శాతం రైతులు మాసూళ్లు నిర్వహించగా మరో 20 శాతం పంట కోత కోయాల్సి ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిర్వహణ వ్యవహార లోపాలు తలెత్తి కొనుగోళ్లు సక్రమంగా జరగక మాసూళ్లు నిర్వహించి ఒబ్బిడి చేసిన ధాన్యం పొలాల మధ్య దిమ్మెలపైన, గట్లపైన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండిపోయింది. మండల గ్రామాల్లో మాసూళ్లు నిర్వహించిన పంట సుమారు 50 శాతం పొలాల్లో రాశుల రూపంలోనే ఉండిపోయినట్టు రైతులు చెబుతున్నారు. వర్షాలు తగ్గడంతో పొలాల్లో రాశులుగా ఉన్న ధాన్యాన్ని రైతులు ఆరబెట్టి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కోత కోసి పనలుగా ఉంచిన పొలాల్లోనూ పంట నీట మునగడంతో రైతులు కూలీల సహాయంతో ఒడ్డుకు చేర్చి మాసూళ్లు నిర్వహిస్తున్నారు. ఇటీవల డెల్టాలో అధిక శాతం రైతులు వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు నిర్వహిస్తున్నారు. అయితే గత ఐదు రోజులుగా ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు వరిచేలు నేలకొరిగి, ముంపునకు గురయ్యాయి. పడిపోయిన పంట నీళ్లల్లో రోజుల తరబడి ఉండిపోవడంతో నేలనంటి మొలకలు వస్తున్నాయి. ఫలితంగా కూలీలతోనే తప్పని సరిగా రైతులు పంటకోత కోయించాల్సి వస్తోంది. దీంతో కూలీలకు అమాంతం డిమాండ్ పెరిగిపోయి కూలి ధర ఆకాశాన్ని చేరింది. గతంలో ఎకరం కోత కోయడానికి ఆరు నుంచి ఎనిమిది మంది కూలీలు అవసరమయ్యేవారు. ప్రస్తుతం పంట నేలనంటడంతో కూలీల సంఖ్య పెరిగిందని రైతులంటున్నారు. పడిపోయిన వరి మొక్కలను నిలబెట్టి కోయడానికి ఎకరానికి 12 నుంచి 15 మంది కూలీలు అవసరమౌతున్నారని రైతులు వాపోతున్నారు. పంట నూర్పిళ్లు చెసేందుకు మరో ఆరుగురు కూలీలు అవసరం అవుతున్నారని వాపోతున్నారు.

వాతావరణ మార్పుతో పెరిగిన రేట్లు

నేలనంటిన వరి పంటను కోత కోసేందుకు కూలీల సంఖ్య పెరగడంతో పాటు వాతావరణంలో మార్పుల కారణంగా కూలి రేట్లు అమాంతం పెరగటంతో రైతులు లబోదిబోమంటున్నారు. శుక్రవారం వాతావరణం కాస్త తెరపినిచ్చినప్పటికీ మధ్య, మధ్యలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని రైతులకు దడ పుట్టించాయి. ఉన్న పంటను దక్కించుకుందామని రైతులంతా ఒక్కసారిగా కోతలు, మాసూళ్ల ప్రారంభించడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. వర్షాల సమయానికి నియోజకవర్గ గ్రామాల్లో కూలిరేట్లు రూ.600 నుంచి రూ.700 ఉండేది. ప్రస్తుతం కూలీలు రోజుకి రూ.800 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పంట కోతలు కోసి నూర్పిళ్లు చేసినా మాసూళ్ల ఖర్చులు కూడా రావని కోయకుండా వదిలేద్దామంటే దాళ్వా ధాన్యం పొలాల్లో ఉండిపోయి తొలకరి పంటలో కేళీలు వస్తాయని, కోత పెట్టుబడులు కూడా రాకపోయినా కోయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

పెట్టుబడులు పెరిగిపోతున్నాయి



వ్యవసాయ రంగానికి ప్రభుత్వ సహకారం లేకపోవడానికితోడు వాతావరణ అనుకూలించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. భారీ వర్షాలకు పనులు ముందుకు సాగక ప్రతి పనికీ అధికంగా కూలీలు అవసరమౌతున్నారు. కూలి రేట్లు పెరిగి పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

పంట వర్షాల బారిన పడింది



ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లు జరగక మిల్లర్లు సైతం కొనుగోళ్లు తగ్గించారు. దీంతో మాసూళ్లు నిర్వహించి ఒబ్బిడి చేసిన ధాన్యం సైతం పొలాల మధ్య దిమ్మెలపైన, గట్లపైన ఉండిపోయి వర్షం తాకిడికి గురయింది. ధాన్యం నాణ్యత లోపించిందంటూ మిల్లర్లు తక్కువ ధరకు అడుగుతున్నారు.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు, బందనపూడి

ఇంకా రహదారులపైనే ధాన్యం



కపిలేశ్వరపురం-అంగర ఆర్అండ్‌బీ రహదారి వెంబడి ఉన్న ధాన్యం రాశులు

కపిలేశ్వరపురం: ఖరీఫ్ సాగు పనులు దగ్గరపడుతున్నాయి. ఇంకా రబీ ధాన్యం రహదారులపైనే ఉంది. ఇలాంటి వింత పరిస్థితికి కారణం ప్రస్తుత కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలే. రైతుకు ఆర్థికంగా పెట్టుబడి సాయమందించ లేకపోయిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనీసం సాగు పద్ధతులనైనా శాస్త్రీయంగా చేయని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సాగు మధ్యలో ఉన్నప్పటి నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేశామని, మద్దతు ధర అమలు చేసేస్తున్నామని, మీకు నచ్చిన చోట ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని, కూటమి అంటే రైతు అనుకూల ప్రభుత్వమంటూ పెద్ద ఎత్తున కూటమి నేతలు ప్రచారం చేసుకున్నారు. ధాన్యం అమ్ముకునే సమయం ఆసన్నం కాగానే రైతు సేవా కేంద్రాలకు లక్ష్యాన్ని నిర్దేశిస్తూ అధికారులు ఆదేశాలను జారీ చేశారు. ప్రతి గింజా కొంటామన్న కూటమి నేతల మాటలు ఏ మాత్రమూ అమలు కాలేదు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకొందామని స్థానిక రైతు సేవా కేంద్రానికి వెళ్లగా తమ కేంద్రం లక్ష్యం పూర్తయిందని, ఇక ఆన్‌లైన్ ప్రక్రియ సాగదంటూ రైతులను వెనక్కి పంపేశారు. మీకు నచ్చిన చోట అమ్ముకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందంటూ ఉదారవాదంతో కూడిన ప్రకటనలను చేశారు. రైతు సేవా కేంద్రమంటే ప్రతి గింజనూ కొనాలి కదా అని అడిగిన రైతుకు సమాధానం ప్రభుత్వం నుంచి రాలేకపోయింది. ఊరూ వాడా రైతులు గగ్గోలు పెట్టగా అధికారులు జిల్లాకు మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనేందుకు అవకాశం ఇచ్చామన్నారు. అయినప్పటికీ ధాన్యం విక్రయాలు నూరుశాతం కాలేదు. నేటికీ నియోజకవర్గంలో అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు, కోరుమిల్లి తదితర గ్రామాల్లోని రహదారుల వెంబడి ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఉన్నాయి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతు భరోసా కేంద్రాలు ద్వారా ప్రతి గింజనూ కొన్న తీరును రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

కాటన్ కృషితో గోదావరి ప్రాంతం సస్యశ్యామలం



కోరుమిల్లిలో కాటన్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

కపిలేశ్వరపురం: కాటన్ కృషితో గోదావరి ప్రాంతం సస్య శ్యామలమయిందని అయన విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న వక్తలు అన్నారు. కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లి వద్ద గోదావరి గట్టుపై ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రిటైర్డ్ హెచ్ఎం చిక్కం సూర్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ కాటన్ చేతికర్రతో గీసిన గీతలన్నీ పంట కాలువలయ్యాయన్నారు. సూర్యనారాయణ మాస్టారు మాట్లాడుతూ మానవ సమాజానికి విశేష సేవలందించిన కాటన్ మహాశయుడిని జాతీయత, ప్రాంతీయతా భేదాలను పక్కన పెట్టి భారతీయులంతా మనస్ఫూర్తిగా ఆరాధిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావు, మండల జనసేన అధ్యక్షుడు తుట్టుపు నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండిశెట్టి నాగేశ్వరరావు, వార్డు సభ్యుడు మోటుపల్లి బాపిరాజు, నాయకులు వెలుగుబంటి యేసుదాసు, వీరభద్రం అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ ఐదుగురి అరెస్ట్

ఆలమూరు: గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులను శుక్రవారం ఆలమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై ఎం.అశోక్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని పెదపళ్లలోని గ్రామ శివారులోని శ్మశానవాటిక వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గంజాయిని నిల్వ ఉంచుకుని సేవిస్తున్నట్టు సమాచారం అందింది. దీనిపై సత్వరమే స్పందించిన ఎస్సై అశోక్ తన సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్క యువకుడు దగ్గర 100 గ్రాముల చొప్పున గంజాయి ఉందని గుర్తించారు. అనంతరం వారి వద్ద ఉన్న మొత్తం 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ కోర్టుకు తరలించగా జడ్జి 14 రోజుల రిమాండ్ కోసం విధించినట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆర్డీవో



పెదపళ్ల పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలోని పీహెచ్‌సీని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుధ్యాన్ని, నిర్వహణ తీరును పరిశీలించారు. అలాగే ఆసుపత్రిలో సిబ్బంది ఎదుర్కొంటున్న గదుల కొరతను ఆయన గుర్తించారు. ఫార్మసీ రూమ్‌ను పరిశీలించి మందుల సరఫరా జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. పీహెచ్‌సీ ప్రధాన ద్వారం పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని గుర్తించి వైద్యారోగ్య సిబ్బంది సూచనల మేరకు అక్కడ ఫార్మసిస్టు గదిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, మందుల కొరత రానీయవద్దని వైద్యాధికారి డి.సాయి కిషోర్‌కు సూచించారు. ఎంపీడీఓ ఎ.రాజు, డిప్యూటీ తహసీల్దార్ టి.సుబ్బరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, గ్రామ కార్యదర్శి వి.వేణి, వీఆర్‌ఓ బి.ఉదయ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనులను ఎటువంటి అవినీతికి తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ కోరారు. మండలంలోని ఆలమూరు, పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. మస్టర్ల సంఖ్యకు అనుగుణంగా కూలీల సంఖ్య ఉందో లేదోనని తనిఖీ చేశారు. ఉపాధి పనులు చేసే సమయంలో కల్పిస్తున్న సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు నిర్దేశించిన కొలతల ఆధారంగా పనులు చేయించాలని, నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి పిడుగు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతిరోజూ ఉపాధి పనుల ప్రగతిని తెలియజేయాలని ఎంపీడీఓ ఎ.రాజు, ఏపీఓ జి.అరుణకుమారిని ఆదేశించారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు, డీటీ టి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు తొలగించాలి



రాజోలు బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న వెంకటరమణ, రమ్య దంపతులు

రాజోలు: కొంతమందిలో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించేందుకు పొదలాడ గ్రామానికి చెందిన దంపతులు కాండ్రేగుల వెంకటరమణ, రమ్య దంపతులు శుక్రవారం రాజోలు ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని, ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించేందుకు వీలు కలుగుతుందని వెంకటరమణ అన్నారు. పొదలాడ కేంద్రంగా యువరత్న ఎన్టీఆర్ సేవా సమితి రక్తదాన శిబిరాలు నిర్వహించి ఎంతో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సేవా సమితి స్ఫూర్తితోనే రక్తదానం చేసినట్టు దంపతులు వెంకటరమణ, రమ్య తెలిపారు.

స్వామివారి సన్నిధిలో ఆర్డీఓ మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అమలాపురం ఆర్డీఓ కొత్త మాధవి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆర్డీఓకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆర్డీఓకు ఆశీర్వచనాలు పలికారు. ఆర్డీఓకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పి.విజయసారథి అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కపిలేశ్వరపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేటున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికని నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల నుంచి రెవెన్యూ, డ్రైనేజీ, భూ రీసర్వే సమస్యలపై అర్జీలు అందాయన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



హసన్‌బాదలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో ఆ గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని తిరంగా యాత్రగా గ్రామంలో పాకిస్తాన్ ఉగ్రవారం నశించాలి. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చింతపల్లి సతీష్, దొంతంశెట్టి ఓం ప్రకాశ్, చోడిశెట్టి వీరభద్రరావు, బొల్లం సత్తిరాజు, పంచాయతీ కార్యదర్శి కాశి రాకేష్ కుమార్, పంచాయతీ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూలై 9న సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం

కపిలేశ్వరపురం: 17 అత్యవసర డిమాండ్ల సాధనలో భాగంగా జూలై 9న సార్వత్రిక సమ్మెను చేపట్టనున్నట్టు సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న చేపట్టాల్సిన సమ్మె దేశంలోని నిర్దిష్ట ఇబ్బందులు కారణంగా దేశంలోని కార్మిక సంఘాల నాయకులు వాయిదా వేశారన్నారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని ప్రతిబింబించేలా డిమాండ్లను కార్మిక సంఘాలు రూపొందించాయన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు, సామాజిక భద్రత, కార్మిక చట్టాల పరిరక్షణ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ సమ్మెకు సన్నద్ధం చేస్తున్నామని కె.కృష్ణవేణి తెలిపారు.

బహిరంగ మాంసాహార విక్రయాలపై నోటీసులు

కాజులూరు: బహిరంగ ప్రదేశాల్లో చేపలు, మాంసం విక్రయాలను నిషేధించాలని గొల్లపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.రవిప్రసాద్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి విచ్చలవిడిగా మాంసాహార విక్రయాలు చేస్తున్నారన్నారు. వీటి వలన భారీ వర్షాల నేపథ్యంలో పరిసరాలు అస్తవ్యస్తంగా తయారై అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం తలెత్తిందన్నారు. అంతేకాకుండా వ్యాపారులు చేపలు, మాంసం వ్యర్థాలు పక్కనే ఉన్న డ్రైనేజీల్లో పడవేయడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి కొద్దిపాటి వర్షాలకే వీధులు, రహదారులు జలమయమవుతున్నాయన్నారు. గ్రామంలోని మార్కెట్ సెంటర్‌లో ప్రభుత్వం మాంసాహార విక్రయదారుల కోసం ప్రతేక మార్కెట్ షెడ్లు నిర్మించినా వ్యాపారులు వాటిని వినియోగించడం లేదన్నారు. పంచాయతీ పాలకవర్గ తీర్మానం మేరకూ బహిరంగ ప్రదేశాల్లో మాంసాహార విక్రయాలను నిషేధించాలని వ్యాపారులకు నోటీసులు జారీ చేశామన్నారు. వ్యాపారులు అవసరమైతే మార్కెట్ షెడ్లు వినియోగించుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

సారా రహిత గ్రామంగా కోరుమిల్లి



కోరుమిల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్సై రాంబాబు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దామని ఆలమూరు ఎక్సైజ్ ఎస్సై పి.రాంబాబు అన్నారు. గ్రామంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రాంబాబు మాట్లాడారు. గతేడాదిగా కోరుమిల్లిలో ఒక్క సారా కేసు కూడా నమోదు కాలేదన్నారు. నవోదయం 2.0లో భాగంగా గత కొన్ని నెలలుగా సారా నిర్మూలనకై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో కోరుమిల్లి గ్రామం సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుకుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ బి.రామ తులసి, వార్డు సభ్యులు వెలుగుబంటి ఏసుదాసు, డ్వాక్రా యానిమేటర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెద్ద వంతెన అప్రోచ్ అధ్వానం



రాళ్లు చెల్లాచెదురుగా లేచి ఉన్న తాతపూడి వంతెన అప్రోచ్

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి బ్యాంక్ కెనాల్‌పై ఉన్న వంతెన అప్రోచ్ అధ్వానంగా ఉంది. గౌతమి గోదావరి నది గట్టుపై నుంచి తాతపూడి గ్రామంలోకి వెళ్లే ప్రయాణికులు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తారు. 2017 అక్టోబర్ 30న రూ.20 లక్షల అంచనాతో నిర్మించిన వంతెనను అప్పటి హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. హడావుడిగా వంతెన ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకూ వంతెన అప్రోచ్ నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం అప్రోచ్‌లోని రాళ్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రాళ్ల మొనలు సూదుల్లా ద్విచక్రవాహనాల టైర్లకు పంక్చర్లు చేస్తున్నాయి. తాతపూడి గ్రామస్తులతో పాటు ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలలో పలు గ్రామాలకు ఈ వంతెన మీదుగా ప్రయాణాలు చేస్తారు. సంబంధిత అధికారులు స్పందించి అప్రోచ్‌ను మెరుగుపర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైభవంగా అమ్మవారి సేవ



పెదపట్నంలంకలో ఆకట్టుకున్న శక్తి వేషం

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువైన మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా గురువారం రాత్రి అమ్మవారి సేవను వైభవంగా జరిపించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, శక్తి వేషాలు, బుట్టబొమ్మల కోలాహలం, తీన్‌మాస్ విన్యాసాలు, భారీ బాణసంచా కాల్పుల నడుమ సేవను అంగరంగ వైభవంగా జరిపించారు. దేవి సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ఈ సేవ నిర్వహించారు. గ్రామంలో కోలాహలం నెలకొంది. యువకులు విజిల్స్ వేస్తూ, డ్యాన్సులు చేస్తూ ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సేవలో పాల్గొన్నారు. కాగా ఆదివారం రాత్రి అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. సోమవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని, మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందన్నారు. అమ్మవారి జాతరలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

పారదర్శకత పాటించాలి

అయినవిల్లి: ఉపాధి పనుల్లో పారదర్శకత పాటించాలని ఎంపీడీఓ జీవీ సరోవరరావు అన్నారు. మండలంలోని నేదునూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ జీవీ సరోవరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు ఉపాధి పనుల నాణ్యత పాటించాలన్నారు. పంట బోదెలు, రహదారుల వెంబడి ఉన్న తూడు, వయ్యారిభామ, చెత్త తొలగించి అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి కూలీలతో కాసేపు చర్చించారు. ఆయన వెంట ఏపీఓ, క్షేత్రసాయి సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సమ్మె శిబిరం వద్ద మద్దతు తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

రామచంద్రపురం: మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ అండ్ లైటింగ్ సిబ్బంది కనీస వేతనాలను పెంచాలని చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు ఉండవల్లి గోపాలరావు, పెద్దిరెడ్డి రాము తదితరులు డిమాండ్ చేశారు. గత అయిదు రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట వర్కర్స్ చేస్తున్న సమ్మె శిబిరం వద్దకు శుక్రవారం చేరుకుని వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వర్కర్స్ సమ్మెను విరమించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆటో అండ్ బీర్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు తోట సూరిబాబు తదితర కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

భీమేశ్వరుని సన్నిధిలో మురళీమోహన్



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మురళీమోహన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ దుర్గాభవాని

రామచంద్రపురం రూరల్: బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.మురళీమోహన్ దంపతులు శుక్రవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వారికి వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని వారికి స్వామివారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

మండలానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపర్చిన పాఠ్య పుస్తకాలు

కపిలేశ్వరపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలు మండలానికి చేరుకున్నట్టు ఎంఈఓ కె.తాతారావు శుక్రవారం తెలిపారు. మండలంలో 8 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 37 ప్రాథమికోన్నత మొత్తం 51 పాఠశాలలకు చెందిన 2,689 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారికోసం 10,486 పుస్తకాలను సరఫరా చేశారన్నారు. వాటిని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో భద్రపర్చామని, సీఆర్పీల పర్యవేక్షణలో తరగతులు వారీగా విభజిస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే మండలంలోని పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తామని ఎంఈఓ తాతారావు తెలిపారు.

గాడ్‌కు సోదరి వియోగం



పీవీఎస్ సుబ్బలక్ష్మి (ఫైల్)

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్)కు సోదరి వియోగం కలిగింది. గాడ్ సోదరి పెదపాటి వెంకట సూర్యసుబ్బలక్ష్మి (85) శుక్రవారం వెదురుపాకలో ఆమె స్వగృహంలో మృతి చెందారు. సుబ్బలక్ష్మికి ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. సుబ్బలక్ష్మి భర్త పెదపాటి వీరభద్రరావు న్యాయ కళాశాల అధ్యాపకుడిగా పనిచేశారు. వెదురుపాకలో సుబ్బలక్ష్మి భౌతికదేహానికి పలువురు నివాళులర్పించిన అనంతరం రాజమహేంద్రవరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలుచేస్తున్న నిత్య అన్నదాన ట్రస్టుకు జగ్గంపేటకు చెందిన సుంకర నాయుడు అతని కుమార్తె మంజూష వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తికి అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.91,542 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.33,022 విరాళాలుగా అందించారన్నారు.